# వెనుకదగా! ముందుదగ

శ్రీమతి పి. జె. శాంతమ్మ

"ఇదిగో! నాన్నా! నాకిచ్చే 116 రూపాయల కట్నంలోను ఆర్కెస్ట్రాకు 50 రూపాయలూ, 16 రూపాయలు యితర ఖర్చులకుపోతే 50 రూపాయలు మనకు మిగులుతవి. మనం తిండి తినకపోతే ఎవరు చూస్తారులేనాన్నా! 30 రూపాయలతో అప్పులు తీర్చెయ్యి; మరిమూడు రూపాయలు నా రిక్షాలకు, ఒక రూపాయి నా పౌడరు డబ్బాకు! ఏం నాన్నా! అలా చూస్తున్నావు - యీ పగటి వేషానికి పౌడరన్నా లేకపోతే ఎవరూ అభిమానం చూపరునాన్నా! తక్కిన రూపాయలతో నాకు, అక్కయ్యకు, నీకు, అమ్మకు, తమ్ముడికి ఒక్కొక్క జతబట్టలుకొను. ఈ యున్న రెండు జతల బట్టలు ఒకటి లాండ్రీలో, మరొకటి ఒంటిమీద మారి మారి యుంటుంటవి. అన్నట్లు-మరచాను-లాండ్రీవాడికి రెండు రూపాయలివ్వాలి; వెంకటస్వామికొట్లో రెండు రూపాయల బియ్యం అప్పు తెచ్చింది అమ్మ - మొత్తం నాలుగు రూపాయలిచ్చెయ్యి. అదిగో-పాలవాడు కాబోలు - రేపిస్తామనిచెప్పు" అంటూ తల దువ్వుకొంటున్నది వనజాక్షి.

వనజాక్షి బాగా పాడేదికాని అదృష్టం కలిసి రాలేదు. ఆమె దగ్గర సంగీతము నేర్చుకునిపోయి వందలు, వేలు సంపాదిస్తున్న వారుండేవారు. వనజాక్షిమాత్రం సరస్వతీ ప్రసన్నురాలేకాని లక్ష్మీప్రసన్నురాలు కాలేదు. దానికి కారణాలున్నవి - నైతికంగా నిప్పు కణికలాంటిది; మానమర్యాదలకు ప్రాధాన్యమిస్తూ వ్యక్తిత్వానికి భంగము వాటిల్లడానికి సమ్మతించేదికాదు.

ఆ వేళ .ఒక పాట కచ్చేరి ఒప్పుకుంది. శెట్టిగారి యింట్లో వివాహం. రు 116 లు కట్నం, ఖర్చులు పైగా యిస్తామన్నారు. అడ్వాన్సుగా రు 30/-లు యిచ్చివేసినట్లే - శెట్టిగారు అంతా మాట్లాడి చివర అడ్వాన్స్ యివ్వబోతూ జేబు తడువుకొని "అయిదు రూపాయలు తక్కువగానున్నది; మధ్యాహ్నమువచ్చి యింటిదగ్గర 30 రూపాయలు తీసికో" అంటూ వెళ్లిపోయాడు.

వనజాక్షి రిక్షాలో శెట్టిగారి యింటికి బయలుదేర బోతున్నది. పాపం ఆ అడ్వాన్సునుండే ఆర్కెస్ట్రా వారికి కొంత యివ్వాలి - తాను కొంత తీసికొని రిబ్బన్లు, సబ్బుముక్క, పూలుకొనుక్కొని కచ్చేరికి ముస్తాబు కావాలి. ఇంతలో తండ్రివచ్చాడు.

"ఏమమ్మా! ఎక్కడికో బయలుదేరావు"

"శెట్టిగారింటికి నాన్నా! అడ్వాన్సు యిస్తాను రమ్మన్నాడు"

"ఎంత పిచ్చితల్లివమ్మా! అందుకనే మనల్ని ఎగిరేపక్షులంటారు. ఏదైనా ఆశ పొడచూపితే ఆకాశానికి ఎగిరిపోతాం. నిరాశతో పాతాళానికి పోతాము. మనం దురాశకు పోవడంలేదు. కాని నిర్భాగ్యులు తమ మండే కడుపులకు అన్నం కోరడం కూడ దురాశగానే పరిణమిస్తుంటుంది. ఆ దొంగ ముండాకొడుకు నిజంగా నీకు డబ్బిస్తాడనా! వాడు యివ్వదలచుకుంటే యిక్కడ యివ్వడానికి తన దగ్గర లేకపోయిందా" అన్నాడు.

ఒక ఉపాధ్యాయిని బాలబాలికలకు కొందరు మహామహుల జీవితచరిత్రలను, విశేషాలను చెప్తూ "రామూ! యింతమంది గొప్పవారి చరిత్రలను, వారు కనిపెట్టిన యంత్రతంత్రాలను విన్నావుకదా — నీవు చదువుకొని పెద్దవాడివయ్యాక చేయబోయే ఘన కార్యాలేమిటి చెప్పు" అని అడిగింది.

"నేనాండీ — మీటనొక్కితే నేను ప్రతి దినం చేయాల్సినలెక్కలు, చదవాల్సిన పాఠాలు, వ్రాయాల్సినదానిని నిర్వహించే యంత్రాన్ని కని పెట్టబోతున్నాను"

ఉపాధ్యాయిని తలఆడిస్తూ "అదేమిటిరా సోమరి వెధవా — రమాదేవీ నీవు చెప్పు"

"మీట నొక్కడానికి సయితం ఏదైనా యంత్రాన్ని కనిపెట్టాను"

"ఏమిటి నాన్నా! అలాగంటావు - ఖర్చులు కాక 116 రూపాయలు కట్నం-అడ్వాన్సు రు 30 లని వ్రాసి సంతకంపెట్టి కాగితము కూడ యిచ్చివెళ్లాడు. అంతమాట తప్పుతాడా" అన్నది కాగితముచూపిస్తూ. తండ్రి కళ్లద్దాలు సవరించుకొని కాగితాన్నిచూచి "ఓసి పిచ్చిదానా! అడ్వాన్స రు 30 లు నీకు చెల్లించినట్లు వ్రాశాడు. కొంపదీసి రు 30 లు వాపసు చేయమంటాడేమోచూడు."

"ఛా! ఎంతమాటనాన్నా! అతను నాకివ్వనిదే యివ్వమంటాడా."

"ఇచ్చేసినట్లే వ్రాశాడుగా"

"ఔను-యివ్వాలనుకొని యుంటాడు - పాపం! డబ్బు తక్కువగా నుండటంచేత యింటిదగ్గర యిస్తాను రమ్మన్నాడు. నేను వెళ్లుతున్నాను; యిస్తాడు."

"హ హ హ యిస్తాడు - వెళ్ళిరామ్మా" అన్నాడు తండ్రి వెటకారంగా.

"ఊరుకోండి నాన్నా! అందరూ ఒకేలాగ దగాకోరులుగా నుంటారా" అంటూ రిక్షాఎక్కి వెళ్లింది.

శెట్టిగారు పెండ్లి పెద్దలతో మాట్లాడుతూ వీధి గుమ్మంలోనే ఎదురయ్యాడు. వనజాక్షి నమస్కారం చేసింది. "వెళ్ళి హాలులో కూర్చోమ్మా!" అన్నాడు శెట్టిగారు.

పావుగంట గడచాక పాటకచ్చేరి రద్దయిందని ఒక కబురు వచ్చింది. శెట్టిగారు వనజాక్షిని చూడనట్లు పెండ్లి పనిపాటలలో నిమగ్నుడై యున్నాడు. సందు చేసికొని శెట్టిగారితో "బాబూ! ఏమిటలా నిర్ణయించారట"

"ఔను - పాటకచ్చేరి అవసరంలేదు"

"ఏం బాబూ"

"మరొక మేళావచ్చి వేధిస్తున్నారు. నీ ప్రోగ్రాం రద్దుచేసి వాళ్లకు అవకాశమిచ్చాను."

"వాళ్లకంటె ముందునుంచి తిరుగుతున్నానుకదా బాబూ! పైగా నన్ను బుక్ చేశారుకూడాను. తమ స్వహస్తాలతో అడ్వాన్సు యిచ్చినట్లు వ్రాసారు."

"ఆ! అన్నట్లు - నీకిచ్చిన అడ్వాన్సు వాపసి చ్చెయ్యి."

"అదేమిటిబాబూ! అయిదు రూపాయలు తక్కువగానున్నవని యింటిదగ్గర యిస్తాను రమ్మని యిప్పుడు ..."

"అదేమిటమ్మా! యివ్వకుండా యిచ్చినట్లు నేను ఎట్లావ్రాసి యుంటాను; ఎలా వ్రాయించుకొని యుంటావు! - పోనీలే పేదదానివి" అంటూ లోప

లికి వెళ్ళాడు శెట్టి. "బాబూ! బాబూ!" అంటూ పిలిచి నిస్పృహతో కాళ్ళీడ్చుకుంటూ యింటి ముఖం పట్టింది.

పడక కుర్చీలో పండుకొని తండ్రి చుట్ట కాలుస్తున్నాడు. వచ్చీరావడంతోటే తండ్రినిచూచి బావురుమని ఏడ్చింది వనజ.

"ఊరుకో అమ్మా! ఊరుకో - నాకు తెలుసు" అన్నాడు కుమార్తెను బుజ్జగిస్తూ.

"నీ కెలా తెలుసు" అంటున్నట్లు తండ్రి ముఖం వైపు చూచింది.

"ఇలాంటి టోకరాల కెన్నింటికి గురికానిదే నా జీవితం యీ స్థితికి వచ్చిందంటావు! నీకే జరిగిన దానిని గురించి నాకు ముందే తెలుసు. డబ్బు పాపిష్టి దని పెద్దలన్నదిందులకే. అది యీ లోకంలో ఎంతపనైనా, ఏపనైనా చేయిస్తున్నది - అదేమి టమ్మా అలా వణకుతున్నావు! - అబ్బా ఒళ్లు కాగి పోతున్నది! పండుకో అమ్మా! మనలాంటి బీద వారి బాధలను ధనవంతులు గ్రహించరు తల్లీ! గ్రహించి సానుభూతిచూపే వారి దగ్గర మనకు సహాయంచేయడానికి డబ్బుండదు" అంటూ తన్ను అనుకొనియున్న కుమార్తెను మంచముమీద సరిగ్గా పండుకో పెట్టాడు.

రీటా హెయిర్ టానిక్




రీటా కుదుళ్ళకు బలమునిచ్చి నిగనిగలాడు నిడుపాటికురులను పెంచే అద్భుతమైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, చుండు, బట్టతల మొదలైన కురుల వ్యాధులకు రీటా అమోఘమైనది. మీరుకూడ నేటి నుండియే రీటా వాడుడు. ప్రతిచోటా దొరుకును.